మన ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# ప్రజా ప్రతినిధి
తెలుగు దినపత్రిక
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :315 సోమవారం సెప్టెంబర్ 7 2026, పేజీలు - 4 వెల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# నేరేడుచర్ల లో...
# కష్టానికి కేరాఫ్ కృష్ణవేణి







- ●కుటుంబం కోసం అడుగడుగునా శ్రమ!
- ●భర్తకు చేదోడుగా పిల్లల భవిష్యత్తు కోసం పోరాటం
- ●రోజుకు 100150 పార్సల్
- ●ఎండా, వానా లెక్కచేయకుండా డెలివరీ
- ●నేరేడుచర్లలో కృష్ణవేణి కష్టానికి సెల్యూట్!
- ●మాటల్లో కాదు చేతల్లో చూపిస్తూ.
- ●ప్రతి మహిళలకు స్ఫూర్తి కృష్ణవేణి.
- ●సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తూ సమయాన్ని వృధా చేయడం కంటే తన కుటుంబం కోసం కష్టపడటానికి కృష్ణవేణి ప్రాధాన్యమిస్తున్నారు




మనప్రజాప్రతినిధి//నేరేడుచర్ల:కుటుంబాన్ని నడపడం అంటే కేవలం ఇంటి నాలుగు గోడల మధ్య బాధ్యతలు నిర్వర్తించడం మాత్రమే కాదు.. అవసరమైతే కుటుంబ ఆర్థిక భారాన్ని పంచుకోవడానికి బయటకు వచ్చి కష్టపడటమూ గొప్ప బాధ్యతే. దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు నేరేడుచర్ల పట్టణానికి చెందిన గుంటి కృష్ణవేణి.మధ్యతరగతి కుటుంబానికి చెందిన కృష్ణవేణి గృహిణిగా ఇంటి బాధ్యతలు చూసుకుంటున్నారు. ఆమె భర్త మూర్తి ఎన్నో ఏళ్లుగా జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు, పిల్లల చదువులు, కుటుంబ పోషణ ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో భర్త సంపాదనపైనే ఆధారపడకుండా తాను కూడా కుటుంబానికి అండగా నిలవాలని కృష్ణవేణి నిర్ణయించుకున్నారు.




## ▶రోజుకు 100 నుంచి 150 పార్సిళ్లు..

నేరేడుచర్ల పట్టణంలో డెలివరీ ఉమెన్‌గా చేరిన ఆమె ప్రతిరోజూ సుమారు 100 నుంచి 150 పార్సిళ్లను ఇంటింటికీ తిరుగుతూ డెలివరీ చేస్తున్నారు. ఎండ, వాన, సమయం అనే తేడా లేకుండా తన పనిని బాధ్యతగా నిర్వర్తిస్తున్నారు.ఇంటి పనులు చూసుకుంటూనే కుటుంబ ఆర్థిక అవసరాలకు తన వంతు సహాయం అందిస్తూ.. పిల్లల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న కృష్ణవేణి పట్టుదల పలువురిని ఆకట్టుకుంటోంది.

## ▶సోషల్ మీడియా కాలక్షేపం కాదు..శ్రమే స్ఫూర్తి!

ప్రస్తుతం సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్‌లలో గంటల తరబడి కాలక్షేపం చేసే వారికి భిన్నంగా.. కృష్ణవేణి తన సమయాన్ని కుటుంబం కోసం సద్వినియోగం చేసుకుంటున్నారు. ఏ పని చిన్నది కాదు.. కష్టపడి సంపాదించడంలోనే గౌరవం ఉందని తన శ్రమతో చాటిచెబుతున్నారు.కుటుంబ బాధ్యతలను మోస్తూనే ఆర్థికంగా భర్తకు అండగా నిలుస్తున్న కృష్ణవేణి వంటి మహిళల కృషిని అభినందించాల్సిన అవసరం ఉంది. కుటుంబం కోసం ఆమె చేస్తున్న శ్రమకు నేరేడుచర్ల ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.కృష్ణవేణి కష్టం.. నేటి మహిళలకు స్ఫూర్తి!

మన
ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :315 సోమవారం సెప్టెంబర్ 7 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## కాంగ్రెస్ పాలన వైఫల్యాలకు నిదర్శనం బాల్క సుమన్

- 33 నెలల పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శ
- చెన్నూర్ అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపణ
- యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలు అమలు కాలేదని ఆగ్రహం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్



మంచిర్యాల, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్ విమర్శించారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మిర్యాల రాజిరెడ్డి, టీజీబీకేఎస్ నాయకులతో కలిసి మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పాలన మొత్తం దగా, వైఫల్యాలు, అన్ని వర్గాల విధ్వంసానికి నిదర్శనంగా మారిందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ 33 నెలల పాలనలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని బాల్క సుమన్ అన్నారు. కనీసం ఒక ఇటుక కూడా పేర్చలేని పరిస్థితి నెలకొన్నప్పటికీ రాష్ట్రంపై రూ. 4 లక్షల కోట్లకు పైగా అప్పుల భారం మోపారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేపట్టకుండా అప్పులు పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం 2

## విజయవాడలో హ్యుందాయ్ షోరూంలో భారీ అగ్నిప్రమాదం



- పైఅంతస్తులో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగతో స్థానికుల్లో ఆందోళన
- సెలవు రోజు కావడంతో తప్పిన ప్రాణనష్టం
- షార్ట్ సర్క్యూట్ కోణంలో దర్యాప్తు

2

## గోవాలో ఫ్రెంచ్ నౌకాదళ నౌక 'లాంగ్వెడాక్' స్నేహపూర్వక పర్యటన



- భారత, ఫ్రెంచ్ నౌకాదళాల మధ్య వృత్తిపరమైన పరస్పర చర్చలు
- విద్యార్థులకు నౌక సందర్శన అవకాశం
- సముద్ర భద్రత సహకారానికి మరింత బలం
- స్నేహపూర్వక దేశాలతో సంబంధాల బలోపేతమే లక్ష్యం

2

## ఈజిప్టులో భారత వైమానిక దళం 'సారంగ్' విన్యాసాలు



- ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో పాల్గొననున్న బృందం
- ప్రపంచంలోనే ఐదు హెలికాప్టర్లతో విన్యాసాలు చేసే ఏకైక జట్టు
- స్వదేశీ ధ్రువ్ హెలికాప్టర్లతో అద్భుత ప్రదర్శనలు
- భారత్-ఈజిప్ట్ రక్షణ సంబంధాలకు మరో మైలురాయి

2

## సరిహద్దులు దాటే నేరాలకు సమిష్టి పోరాటం అవసరం



- అంతర్జాతీయ పోలీసు సహకారం అవసరం
- మారుతున్న నేరాల స్వరూపం
- సాంకేతిక పరిజ్ఞానం, కొత్త సవాళ్లు
- ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర ముఠాలు
- సమన్వయంతోనే సమర్థవంతమైన చర్యలు
- శాంతి, భద్రతల కోసం ప్రపంచ ఐక్యత

2

## హుస్సేన్ సాగర్ తీరంలో ఘనంగా తెలంగాణ గంగా తెప్పోత్సవం

- ట్యాంక్ బండ్ వద్ద భక్తిశ్రద్ధల మధ్య గంగా హారతి
- భారీగా తరలివచ్చిన మహిళలు, గంగపుత్రులు
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి




హైదరాబాద్, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద హుస్సేన్ సాగర్ తీరంలో తెలంగాణ గంగా తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగా హారతి స్వీకరించి భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హుస్సేన్ సాగర్ తీర ప్రాంతం భక్తుల సందడితో కళకళలాడగా, గంగా మాత నామస్మరణలతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. గంగా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ప్రజాప్రతినిధులు గంగపుత్రుల సంప్రదాయాలను కొనియాడుతూ వారి సేవలను గుర్తు చేశారు.గంగా తెప్పోత్సవానికి మహిళలు, గంగపుత్రులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన భక్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగా హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా సాగగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సాంప్రదాయ సంగీతం, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలోని గంగపుత్రులు, మత్స్యకారుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలు ఎంతో గొప్పవని అన్నారు. వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో గంగపుత్రుల పాత్ర విశిష్టమైందని, వారి సంస్కృతి తెలంగాణ వారసత్వంలో ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు. హుస్సేన్ సాగర్ తీరంలో నిర్వహించిన గంగా తెప్పోత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతి, గంగపుత్రుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. గంగా మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు. కార్యక్రమం ముగింపులో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, గంగా హారతితో వేడుకలు ఆధ్యాత్మికంగా ముగిశాయి.

## బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం



- బీహార్‌లోని ఔరంగాబాద్‌లో దారుణ ఘటన
- బస్సు కోసం వేచి చూస్తుండగా అపహరణ
- నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు


ఔరంగాబాద్ (బీహార్), సెప్టెంబర్ 6(మనప్రజాప్రతినిధి): బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లాలో ఓ బాలికపై జరిగిన కిడ్నాప్, సామూహిక అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం, అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లి, సోదరిని చూసేందుకు నగరానికి వెళ్లేందుకు బాధిత బాలిక ఇంటి నుంచి బయలుదేరింది. బస్సు కోసం రోడ్డుపై వేచి చూస్తున్న సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. సంఘటన వెలుగులోకి రావడంతో స్థానికంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాలిక బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఓ కారు అక్కడికి చేరుకుని ఆగిందని తెలుస్తోంది. ఎక్కడికి వెళ్తున్నావంటూ మాట్లాడిన ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకున్నారని పోలీసులు తెలిపారు. 2

# కాంగ్రెస్ పాలన వైఫల్యాలకు నిదర్శనం బాల్క సుమన్


మెదటి పేజీ తరువాయి

దెబ్బతీసిందని విమర్శించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే కార్యక్రమాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెన్నూర్ నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు తీసుకువచ్చామని బాల్క సుమన్ గుర్తు చేశారు. మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో తొమ్మిది విడతల్లో వేలాది మంది పేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. పేదల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి గత ప్రభుత్వం కట్టుబడి పనిచేసిందని పేర్కొన్నారు. చెన్నూర్ ప్రాంత అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు మరచిపోలేరని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తో పాటు పారిపెల్లి, అస్నాద్ నూతన మండలాల ఏర్పాటుకు సంబంధించిన జీవోలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయకుండా అడ్డుకుందని ఆయన ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ నిర్ణయాలను నిలిపివేశారని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే పరిపాలనా నిర్ణయాలను కూడా రాజకీయ కారణాలతో నిలిపివేయడం సరైన విధానం కాదని అన్నారు.ఎన్నికల సమయంలో చెన్నూర్ యువతకు 45 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మంత్రి వివేక్ ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదని బాల్క సుమన్ ఆరోపించారు. యువతకు నాలుగు ఉద్యోగాలు కూడా కల్పించలేకపోయారని, కానీ తమ కుటుంబ సభ్యులకు మాత్రం రాజకీయ పదవులు దక్కించుకున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఉద్యోగాల భర్తీ విషయంలో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. రూ.12 వేల కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వం నుంచి సమాధానం రాబట్టాలని మంత్రి వివేక్‌ను కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాలను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గోవాలో ఫ్రెంచ్ నౌకాదళ నౌక 'లాంగ్వెడాక్' స్నేహపూర్వక పర్యటన


మెదటి పేజీ తరువాయి

గోవా, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): ఫ్రాన్స్ నౌకాదళానికి చెందిన యుద్ధ నౌక 'లాంగ్వెడాక్' స్నేహపూర్వక పర్యటనలో భాగంగా గోవాకు చేరుకుంది. ఈ సందర్భంగా భారత నౌకాదళం, ఫ్రెంచ్ నౌకాదళం మధ్య పలు వృత్తిపరమైన పరస్పర చర్చలు, అనుభవాల మార్పిడి కార్యక్రమాలు నిర్వహించారు. ఇరు దేశాల నౌకాదళాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల నౌకాదళ సిబ్బంది పరస్పరం నౌకలను సందర్శించి కార్యకలాపాలపై అవగాహన పెంపొందించుకున్నారు. సముద్ర భద్రత, నౌకాదళ నిర్వహణ, ఆధునిక సాంకేతికత వినియోగం వంటి అంశాలపై చర్చలు జరిపారు. ఈ పరస్పర కార్యక్రమాలు ఇరు దేశాల నౌకాదళాల మధ్య సమన్వయాన్ని మరింత పెంచనున్నాయని భావిస్తున్నారు.జాతీయ క్యాడెట్ దళం సముద్ర విభాగానికి చెందిన గోవా విద్యార్థులకు కూడా ఫ్రెంచ్ నౌకను సందర్శించే అవకాశం కల్పించారు. విద్యార్థులు నౌకలోని వివిధ విభాగాలను పరిశీలించి అక్కడి సాంకేతిక వ్యవస్థలు, భద్రతా ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శన యువతలో సముద్ర భద్రత, నౌకాదళ సేవలపై ఆసక్తిని పెంపొందించేలా ఉందని అధికారులు తెలిపారు. భారత్, ఫ్రాన్స్ మధ్య రక్షణ రంగంలో సహకారం గత కొన్ని సంవత్సరాలుగా మరింత బలపడుతోంది. నౌకాదళాల మధ్య సంయుక్త విన్యాసాలు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారం వంటి అంశాలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి. గోవా పర్యటన కూడా ఆ సహకారానికి మరో నిదర్శనంగా నిలిచింది.సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వం, అంతర్జాతీయ జలాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు ఇలాంటి స్నేహపూర్వక పర్యటనలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నౌకాదళ అధికారులు పేర్కొన్నారు. పరస్పర అవగాహన, నైపుణ్యాల మార్పిడి ద్వారా ఇరు దేశాలు తమ సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. స్నేహపూర్వక దేశాలతో నిర్మాణాత్మక సహకారం, పరస్పర అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని భారత నౌకాదళం వెల్లడించింది. ఫ్రెంచ్ నౌకాదళ నౌక లాంగ్వెడాక్ గోవా పర్యటన ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు సముద్ర భద్రత రంగంలో సహకారానికి కొత్త ఊపునివ్వనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం


మెదటి పేజీ తరువాయి


అనంతరం ఆమె చేతులు, కాళ్లు కట్టేసి నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లినట్లు బాధితురాలు వాంగ్మూలంలో పేర్కొన్నట్లు సమాచారం. అపహరణ అనంతరం బాలికను భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలుస్తోంది.నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనను వదిలిపెట్టాలని బాధితురాలు వేడుకున్నప్పటికీ వారు కనికరం చూపలేదని ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ఘటన అనంతరం నిందితులు ఆమెను మరో ప్రాంతంలో వదిలేసి, జరిగిన విషయం ఎవరికి చెప్పినా చంపేస్తామని బెదిరించినట్లు బాధితురాలు తెలిపినట్లు సమాచారం. బాధితురాలు సురక్షితంగా బయటపడిన అనంతరం కుటుంబ సభ్యులకు, పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు, నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది.దర్యాప్తు సందర్భంగా బాధితురాలు వెల్లడించిన కొన్ని అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులు గతంలో కూడా పలువురిపై నేరాలకు పాల్పడినట్లు చెప్పారని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ వాదనల నిజానిజాలను పోలీసులు ఇంకా నిర్ధారించాల్సి ఉందని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అధికారిక దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, బాలికల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిందితులను త్వరగా అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేసుకు సంబంధించిన అన్ని వివరాలను సేకరిస్తున్నామని, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# విజయవాడలో హ్యుందాయ్ షోరూంలో భారీ అగ్నిప్రమాదం



విజయవాడ, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): విజయవాడ నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న హ్యుందాయ్ కార్ల షోరూంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. షోరూం భవనం పైఅంతస్తు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. మంటలతో పాటు దట్టమైన పొగ పెద్ద ఎత్తున వ్యాపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మంటలు మరింత విస్తరించకుండా నియంత్రించేందుకు గంటల పాటు శ్రమించారు. అగ్ని ప్రమాదం కారణంగా షోరూం భవనం పైఅంతస్తులోని సామగ్రికి గణనీయమైన నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మంటల తీవ్రత కారణంగా కొంతసేపు ఆ ప్రాంతమంతా పొగతో కమ్ముకుపోయింది.ఆదివారం కావడంతో షోరూంకు సెలవు ఉండటంతో సిబ్బంది, వినియోగదారులు ఎవరూ అక్కడ లేరు. దీంతో పెను ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు. ఇదే ప్రమాదం పనిదినంలో జరిగి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ఈ పరిణామం స్థానికులను కలవరపాటుకు గురిచేసింది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. భవనం పైఅంతస్తులోని విద్యుత్ వ్యవస్థలో ఏర్పడిన లోపం వల్ల మంటలు చెలరేగి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మాత్రమే అసలు కారణం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం మరింత విస్తరించకుండా నిలువరించగలిగారు. సమీపంలోని ఇతర భవనాలకు, వాహనాలకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. దీంతో పెద్ద స్థాయి విపత్తు తప్పిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను గుర్తించే పనిలో ఉన్నారు. మంటలు పూర్తిగా ఆరిపోయిన అనంతరం ఆస్తి నష్టంపై సమగ్ర అంచనా వేయనున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఈజిప్టులో భారత వైమానిక దళం 'సారంగ్' విన్యాసాలు


మెదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): భారత వైమానిక దళానికి చెందిన ప్రతిష్ఠాత్మక 'సారంగ్' హెలికాప్టర్ డిస్‌ప్లే బృందం ఈజిప్టుకు చేరుకుంది. సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు ఎల్ అలమైన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరగనున్న రెండో ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో ఈ బృందం పాల్గొననుంది. భారత వైమానిక దళం తరఫున అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను చాటే లక్ష్యంతో సారంగ్ బృందం తన విన్యాసాలను ప్రదర్శించ నుంది.సారంగ్ బృందం ప్రపంచంలోనే ఐదు హెలికాప్టర్లతో సమన్వయపూర్వక వైమానిక విన్యాసాలు నిర్వహించే ఏకైక హెలికాప్టర్ ప్రదర్శన బృందంగా గుర్తింపు పొందింది. అత్యంత కచ్చితత్వంతో, సమన్వయంతో కూడిన విన్యాసాల ద్వారా ప్రేక్షకులను అలరించడంలో ఈ బృందానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పైలట్ల నైపుణ్యం, క్రమశిక్షణ, సమయపాలన ఈ ప్రదర్శనల ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.ఈ బృందం స్వదేశీంగా రూపకల్పన చేసి తయారు చేసిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ 'ధ్రువ్'ను వినియోగిస్తోంది. సమీప దూరాల్లో సమూహంగా ఎగిరే విన్యాసాలు, సమన్వయంతో కూడిన వైమానిక కదలికలు, క్లిష్టమైన ఆకృతి ప్రదర్శనలు సారంగ్ ప్రత్యేకతగా నిలిచాయి. ప్రతి విన్యాసం ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపేలా అత్యంత జాగ్రత్తగా రూపొందించబడుతుంది. సారంగ్ బృందం ప్రదర్శనలు భారత వైమానిక దళం సామర్థ్యాలను మాత్రమే కాకుండా దేశీయ రక్షణ తయారీ రంగం అభివృద్ధిని కూడా ప్రతిబింబిస్తాయి. ధ్రువ్ హెలికాప్టర్ సామర్థ్యాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడం ద్వారా భారత స్వదేశీ వైమానిక సాంకేతికతకు మరింత గుర్తింపు లభించనుంది.ఈ కార్యక్రమంలో పాల్గొనడం భారత్–ఈజిప్ట్ మధ్య పెరుగుతున్న రక్షణ, దౌత్య సంబంధాలకు నిదర్శనంగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య రక్షణ రంగ సహకారం మరింత బలోపేతం అవుతున్న నేపథ్యంలో సారంగ్ బృందం పాల్గొనడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో సారంగ్ బృందం తన అద్భుత వైమానిక విన్యాసాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. భారత వైమానిక దళం నైపుణ్యం, స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పే మరో కీలక అవకాశంగా ఈ ప్రదర్శన నిలవనుంది.


# సరిహద్దులు దాటే నేరాలకు సమిష్టి పోరాటం అవసరం

మెదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ 6 (మనప్రజాప్రతినిధి) ప్రపంచం నేడు ఒక గ్రామంగా మారిపోయింది. రవాణా, సమాచార సాంకేతికత, అంతర్జాతీయ వాణిజ్యం అభివృద్ధి చెందడంతో దేశాల మధ్య దూరాలు తగ్గిపోయాయి. అయితే ఇదే పరిస్థితిని నేరస్థులు కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఒక దేశంలో నేరం చేసి మరొక దేశంలో తలదాచుకోవడం, అంతర్జాతీయ ఆర్థిక మోసాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు వంటి కార్యకలాపాలు సరిహద్దులను దాటి విస్తరిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్క దేశం మాత్రమే నేరాలను అరికట్టడం సాధ్యం కాదు. అందుకే అంతర్జాతీయ పోలీసు సహకారం కాలానుగుణ అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో జరుపుకునే అంతర్జాతీయ పోలీసు సహకార దినోత్సవం ప్రపంచ భద్రత కోసం సమిష్టి కృషి ఎంత ముఖ్యమో గుర్తు చేస్తోంది.గతంలో నేరాలు ఎక్కువగా ఒక ప్రాంతం లేదా ఒక దేశానికి మాత్రమే పరిమితమయ్యేవి. కానీ ప్రస్తుతం నేరాల స్వరూపం పూర్తిగా మారిపోయింది. అంతర్జాతీయ నేర ముఠాలు అనేక దేశాల్లో తమ వలలను విస్తరించాయి. నకిలీ కరెన్సీ, మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ మోసాలు, ఆయుధాల అక్రమ వ్యాపారం వంటి నేరాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. వీటిని అరికట్టాలంటే వివిధ దేశాల పోలీసు సంస్థలు పరస్పరం సమాచారాన్ని పంచుకోవడం, సంయుక్త దర్యాప్తులు నిర్వహించడం, నేరస్థులను గుర్తించి పట్టుకోవడంలో సమన్వయం చేసుకోవడం అత్యవసరం. అంతర్జాతీయ సహకారం లేకుండా ఈ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం అసాధ్యం.సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి ఒకవైపు మన జీవితాలను సులభతరం చేస్తుండగా, మరోవైపు కొత్త రకాల నేరాలకు కూడా అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా సైబర్ నేరాలు ప్రపంచ దేశాలకు పెద్ద సవాలుగా మారాయి. ఒక దేశంలో కూర్చొని మరొక దేశంలోని వ్యక్తుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేయడం, కీలక సమాచారాన్ని దొంగిలించడం, ప్రభుత్వ వ్యవస్థలపై దాడులు చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. ఈ తరహా నేరాలను అరికట్టాలంటే సాంకేతిక నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో సమాచార మార్పిడి కూడా అవసరం. పోలీసు వ్యవస్థలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.ఉగ్రవాదం ప్రపంచ శాంతి, భద్రతలకు అతిపెద్ద ముప్పుగా కొనసాగుతోంది. ఉగ్రవాద సంస్థలు తమ కార్యకలాపాలను అనేక దేశాలకు విస్తరించడమే కాకుండా ఆధునిక సాంకేతికతను కూడా వినియోగిస్తున్నాయి. ఉగ్రవాదులకు నిధులు అందించే వలయాలు, ఆయుధాల సరఫరా మార్గాలు, శిక్షణా కేంద్రాలు అనేక దేశాల్లో విస్తరించి ఉండటం వల్ల వాటిని గుర్తించడం క్లిష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో వివిధ దేశాల పోలీసు, నిఘా సంస్థల మధ్య సమన్వయం అత్యంత కీలకం. సమాచారాన్ని వేగంగా పంచుకోవడం ద్వారా అనేక ఉగ్రదాడులను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతోంది.అంతర్జాతీయ పోలీసు సహకారంలో సమాచార మార్పిడి అత్యంత ప్రధానమైన అంశం. నేరస్థుల వివరాలు, వేలిముద్రలు, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు వంటి సమాచారం వేగంగా అందుబాటులోకి వస్తే దర్యాప్తు మరింత సమర్థవంతంగా సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రత్యేక సహకార వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని నేరాల నియంత్రణలో భాగస్వామ్యం అవుతున్నాయి. నేరస్థులు సరిహద్దులను దాటి తప్పించుకునే అవకాశాలను తగ్గించడంలో ఈ విధానం కీలకంగా మారింది. సమయానికి సమాచారం అందితే అనేక నేరాలను ముందుగానే అరికట్టవచ్చు. ప్రపంచ భద్రతను కాపాడడంలో పోలీసు వ్యవస్థల పాత్ర అత్యంత కీలకమైనది. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడం మాత్రమే కాకుండా చట్టబద్ధమైన సమాజ నిర్మాణంలో కూడా పోలీసుల బాధ్యత అపారమైనది. అంతర్జాతీయ సహకారం పెరగడం వల్ల వివిధ దేశాల పోలీసులు తమ అనుభవాలను పంచుకోవడానికి,

# చేగుంటలో విలేకరులకు ఘన సన్మానం

## లయన్స్ క్లబ్, ఉప సర్పంచ్ రఫీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సన్మానం




మన ప్రజప్రతినిధి తెలుగు దినపత్రిక మెదక్ జిల్లా చేగుంట, సెప్టెంబర్ 06:జర్నలిస్టుల సేవలను పురస్కరించుకుని చేగుంట మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు రాజనకు రామచంద్రం నేతృత్వంలో లయన్స్ సభ్యులు విలేకరులకు శాలువాలు కప్పి, వారి నిరంతర ప్రజాసేవకు గుర్తింపుగా కలం (పెన్) అందజేసి అభినందించారు. అనంతరం చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ పాల్గొని ప్రింట్ అండ్ మీడియా ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా సమస్యలను నిక్కచ్చిగా వెలికితీస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల పాత్ర సమాజంలో ఎంతో కీలకమైనదని కొనియాడారు. సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న పాత్రికేయుల సేవలు ఎనలేనివని, కలం యోధులను గౌరవించుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రజకునకు రామచంద్రం,సెక్రటరీ బుర్కా నాగరాజు,డిస్ట్రక్ చైర్ పర్సన్ వంటరి రాంరెడ్డి, క్యాషియర్ దుర్గం అనిల్ కుమార్, మాజీ అధ్యక్షులు శంబుని శ్రీనివాస్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ,సభ్యులు సతీష్, ప్రింట్ అయిన మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక




నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )నేరేడుచర్ల మండలం చిల్లపల్లి గ్రామంలో నవ సమాజ నిర్మాత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎం ఎస్ పి, నూతన గ్రామ కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నేరేడుచర్ల మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు యడవల్లి అరుణ్ మాదిగ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించడం ద్వారా దళిత సమాజంలో ఎన్నో సంవత్సరాలుగా అంతరగా తంగ పేరుకుపోయిన అస్మానతలు క్రమంగా తొలగిపోయాయని అన్నారు. ఇప్పటివరకు అవకాశాలకు నోచుకోని మాల మాదిగ తదితర ఎస్సీ ఉపకులాలు వర్గీకరణ ద్వారా విద్య ఉద్యోగ రంగాలలో సుమించిత అవకాశాలు లభించే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ దళిత సమాజంలో సమానత్వ సాధనకు ద్రోహదపడుతుందని పేర్కొన్నారు. ఎంఎస్పి గ్రామ శాఖ అధ్యక్షుడు మాతంగి బిక్షం మాదిగ, అధికార ప్రతినిధి కడప ప్రసాద్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పాతకోటి గంగరాజు మాదిగ, కార్యదర్శి పరంగి మైసయ్య మాదిగ, ఉపాధ్యక్షులు నన్నెపంగా బంగారు మాదిగ, కార్యదర్శి మాతంగి సైదులు మాదిగ, ప్రచార కార్యదర్శి నన్నెపంగా ముసలయ్య మాదిగ, సహాయ కార్యదర్శి పాతకోటి రామయ్య మాదిగ, కార్యవర్గ సభ్యులు మాతంగి సైదులు ఇరుగు రవి మాతంగి సన్నీ బట్టు సైదులు ఇరుగు లింగయ్య నన్నెపంగా కిరణ్ నన్నెపంగా గిరి ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

# ఐఓసీ మందిరంలో ఘనంగా 30వ వార్షికోత్సవ వేడుకలు



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట సెప్టెంబర్ 06: చేగుంట పట్టణ కేంద్రంలో గల ఐఓసీ మందిరంలో ఆదివారం 30వ వార్షికోత్సవ వేడుకలను సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించరు,ప్రారంభం నుంచి సంఘంలో కొనసాగుతున్న సభ్యులను, ఘనంగా సన్మానించారు. పలువురు తమ జీవితాల్లో దేవుడు చేసిన మేలులను సాక్ష్యాలుగా వివరించారు. దేవుని కృప, ఆశీర్వాదాలను సాక్ష్యపూర్వకంగా ప్రకటించారు. అనంతరం కేక్ కట్ చేసి వార్షికోత్సవ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సుధాకర్, నాగమోహన్, డాక్టర్ ప్రభుదాస్, భక్తపాల్, జాన్, సైమన్, లక్ష్మణ్, లైబ్రరీ గణేష్. యవనస్తులు గోపి. మధుసూదన్. ప్రభు. ప్రేమ్. నిరీక్షణ. అభిలాష్. వెంకటి. రవి కిషోర్ పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం ఎక్కడ...నిరుద్యోగ భృతి ఏడబాయె




నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రకటించిన రాజీవ్ యువ వికాసం ఎక్కడ అని ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా మాజీ అధ్యక్షుడు చిలక రాజు శ్రీను రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు... ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలు విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిందని, ముఖ్యంగా నిరుద్యోగ భృతి అలాగే రాజీవ్ యువ వికాస లాంటి పథకాలతో పాటు అనేకహామీ ఇచ్చి ఉన్నారని వికలాంగులకు 6000 పెన్షన్ మిగతా వర్గాలకు నాలుగు వేల రూపాయలు పెన్షన్ అందిస్తామని వారిని మోసం చేశారని ఆంధ్రప్రదేశ్ మాదిరిగా ప్రతినెలా ఒకటవ తేదీన పెన్షన్ అందించాలని వారి లాగే 6000 రూపాయలతో పాటు మిగతా వారికి నాలుగు వేల రూపాయలు పెన్షన్ అందించి ఆదుకోవాలని , జనాబాలో 56% బీసీలకు ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన 20 హామీ లను అమలు చేయాలని వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12,000 పాటు ఆటో కార్మికులకు కూడా సంవత్సరానికి 12,000 అందించాలని విద్యార్థి ను లకు ఉచిత స్కూటీలు అందించాలని వివాహ అయిన మహిళలకు నెలకు 2500 రూపాయలు అందించి ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం,,, కాంగ్రెస్ పార్టీ తమలో తాము కలహించుకొని వాటి ని పరిష్కరించుకునే పనిలో చాలా బిజీగా ఉన్నట్టున్నారని ఆయన ఎద్దేవా చేశారు ఈనెల 8, 9 మరియు 10వ తేదీలలో యాదగిరిగుట్టలో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమం లో ఊట్కూరు బాలాజీ, నన్నెపంగు సాత్విక్,గండ్ర సైదులు,అమరారం హర్షిత్,దుగ్గి కార్తీక్, బత్తిని వివేక్,అజ్మీత్ తదితరులు పాల్గొన్నారు

# స్వాతంత్ర్య ఫలాలు బిసి, ఎస్సీ,ఎస్టీల దరి చేరడం లేదు



అనంతగిరి (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ) స్వాతంత్ర వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న నేటికీ స్వాతంత్ర ఫలాలు బీసీ, ఎస్సీ,ఎస్టీల దరి చేరడం లేదని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు ఆదివారం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలో బీసీ ముఖ్య నాయకులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ...... ఒకపక్క దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని పాలకులు ఎన్ని కల్ల బొల్లి మాటలు చెప్పినా ఈనాటికి రేషన్ బియ్యం కోసం జనం క్యూలో నిలబడుతున్నారని సరైన వైద్యం అందక అనేకమంది హఠాన్మరణం చెందుతున్నారని నాణ్యమైన విద్య అందక పోటీ పరీక్షల్లో బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలు వెనుకబడిపోతున్నారని న్యాయ వ్యవస్థ కూడా పేదవాడికి అందుబాటులో లేకుండా పోయిందని అందు కొరకు ప్రభుత్వాలు ఏవైనా సరే ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత న్యాయం అందించాలని అప్పుడే స్వాతంత్ర పాలు అందరికీ అందినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. ఒకేసారి అంతరిక్షంలోకి 104 ఉపగ్రహాలు పంపిస్తున్న భారతదేశం భూమ్మీద ఆకలిని లేకుండా చేయలేక పోయిందని ఇంకా ఆకలి చావులు ఉన్నాయని పౌష్టికాహార లోపంతో అనేకమంది చిన్నపిల్లలు మరణానికి గురవుతున్నారని అంటే భారతదేశం అభివృద్ధి చెందాల్సినంతగా అభివృద్ధి చెందలేదనేది స్పష్టం అవుతుందని, అందుకు కారణం భారతదేశంలో పాలకుల అవలంబిస్తున్న విధానాలు ప్రధాన కారణమని అంబానీ -అదానీ లాంటి కార్పొరేటర్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ సౌకర్యం కల్పిస్తూ రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేకపోతున్న పాలకుల నిజస్వరూపాన్ని దేశ ప్రజలందరూ అర్థం చేసుకోవాలని మతం పేరుతో కులం పేరుతో ప్రజల దృష్టిని మరల్చి వారు చైతన్యం కాకుండా కేవలం చెక్క భజనలకే పరిమితం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. దేశ జనాభాలో 92 శాతం ఉన్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు మైనారిటీలు చైతన్యవంతమై మంచి పాలకులను ఎన్నుకుంటే మంచి ఫలితాలు వస్తాయని మతం మత్తులో ఓట్లు వేయడం ద్వారా మరికొన్ని దశాబ్దాలు వెనుకబాటు తనానికి గురవుతారని ఈ వాస్తవాన్ని దేశంలోని యువత గ్రహించి తమ కుటుంబ సభ్యులను చైతన్య పరచాల్సిన బాధ్యత జెన్ జీ యువతపై ఉన్నదని ఆయన అన్నారు ఆయన వెంట బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సుందరయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇనుగుర్తి వెంకట రమణాచారి కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు నిగిడాల వీరయ్య మహిళా విభాగం జిల్లా నాయకురాలు బచ్చు రాజ్యం, నియోజకవర్గ అధ్యక్షురాలు మండవ నాగమణి ఉన్నారు

# కాంగ్రెస్ హామీలపై బిఆర్ఎస్ బాకీ కార్డుల పంపిణీ



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫ్లమైందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బాకీ కార్డుల పంపిణీ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు దాటిన సందర్భంగా బిఆర్ఎస్ నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధించిన బాకీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం బిఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవినీతి, అక్రమాలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నకిరేకల్ పర్యటనలో భాగంగా



మన ప్రజా ప్రతినిధి దినపత్రికతిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి గారిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు6 గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలకు అమలు చెయ్యకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు నకిరేకల్ పట్టణంలో 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపన చేసిన దానిని ఆదివారం రోజున రేవంత్ రెడ్డి ప్రారంభించడానికి వస్తున్నాడు..., ఈ సందర్భంగా మమ్మల్ని హౌస్ అరెస్టు చెయ్యడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని తనం అన్నారు..., కాంగ్రెస్ సర్కారు కు దమ్ముంటే 6 గ్యారెంటీ లు అమలు చేయాలని అన్నారు.

# శేరీలా గ్రామంలో తీవ్ర విషాదం యువరైతు రఘుపతి మృతి



వెల్దుర్తి మన ప్రజాప్రతినిధి ముకుంద్ సెప్టెంబర్ 6:వెల్దుర్తి మండలం శేరిలా గ్రామానికి చెందిన యువ రైతు మిర్జాపల్లి రఘుపతి ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో అకాల మరణం చెందాడు.పొలం ఒడ్డున ఉన్న గడ్డిని బుష్ కట్టర్ తో కట్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు బుష్ కట్టర్ విద్యుత్ వైర్ కు తగిలి తీవ్రంగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.రఘుపతి మృతితో శేరిలా గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. యువ రైతు ఇలా అకాలంగా మృతి చెందడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వినాయక చవితి ఉత్సవాలను శాంతి భద్రతలతో జరుపుకోవాలని



మన ప్రజా ప్రతినిధి దినపత్రి:తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎస్సై గుత్తా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాలలో ప్రజలకు వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ సూచనలు మరియు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.గణేష్ మండపాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా గణేష్ మండపం/వినాయక విగ్రహం ఏర్పాటు మరియు ఊరేగింపుకు సంబంధించిన దరఖాస్తు చేసుకొని, అవసరమైన అన్ని అనుమతులను ముందుగానే పొందాలి. అనుమతులు పొందిన అనంతరం మాత్రమే మండపాలను ఏర్పాటు చేసుకోవాలి.మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు, విద్యుత్ సదుపాయం, ఊరేగింపు మార్గం తదితర వివరాలను దరఖాస్తులో సక్రమంగా నమోదు చేసి, సంబంధిత శాఖల నుండి అవసరమైన అనుమతులు పొందాలి.ముఖ్యంగా గణేష్ మండపాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ డిజే నిర్వహించరాదు. అధిక శబ్దంతో సంగీతం నిర్వహించి ప్రజలకు, విద్యార్థులకు, వృద్ధులకు మరియు అనారోగ్యంతో ఉన్న వారికి ఇబ్బంది కలిగించరాదు. లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధించి పోలీసు శాఖ నిర్దేశించిన నిబంధనలు మరియు సమయాలను తప్పనిసరిగా పాటించాలి.మండపాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా, రహదారులను పూర్తిగా ఆక్రమించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ వైరింగ్, మండప నిర్మాణం మరియు అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలి.వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో క్రమశిక్షణ పాటిస్తూ, పోలీసు శాఖ సూచించిన మార్గంలో మాత్రమే ఊరేగింపు నిర్వహించాలి. ఎలాంటి వివాదాలకు, రెచ్చగొట్టే చర్యలకు లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలకు పాల్పడరాదు.ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి, వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా సురక్షితంగా మరియు సోదరభావంతో నిర్వహించుకోవాలని మనవి

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ కేసీఆర్

**- ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం**
**- అసెంబ్లీ వ్యూహాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం**
**- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు**
**- జలాలు, రైతు సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని సూచన**






సిద్దిపేట, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆయన అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాడాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు.ఈ సందర్భంగా మాట్లాడిన కేసీఆర్, తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందనే భయంతో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన సరిగా నిర్వహించలేకపోతున్న ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వేదికలను రాజకీయ ఆరోపణలకు ఉపయోగించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేసీఆర్ ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ సభ్యులు ఉధృతంగా పోరాడాలని సూచించారు. రైతులకు అవసరమైన సాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావించాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం వైఖరిని ప్రజల ముందుంచాలని పిలుపునిచ్చారు.కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టుల నిర్వహణపై కూడా కేసీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టుల పనితీరు, నీటి వినియోగం, సాగునీటి పంపిణీ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలకు పార్టీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కేసీఆర్ సూచించారు. ప్రతి చర్చలో చురుగ్గా పాల్గొని ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆదేశించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రధానంగా ప్రస్తావించాలని అన్నారు. సభల్లో బీఆర్ఎస్ వైఖరి ప్రజా ప్రయోజనాలకే అంకితమై ఉండాలని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండా కావాలని కేసీఆర్ పేర్కొన్నారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, సాగునీరు, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ సభ్యులకు సూచించారు. రానున్న సమావేశాల్లో ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ వ్యూహాలపై విస్తృతంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# మెట్రోఆర్టీసీ ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలి ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ సంయుక్త ప్రయాణ పాస్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్ శాఖ, మెట్రో వాటర్‌వర్క్స్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రజలకు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెలవారీ, రోజువారీ ఉమ్మడి పాస్‌లను అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ తదితరులు మెట్రో మొదటి, రెండో దశల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధాన కార్యదర్శికి వివరించారు. నగర రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను ఆయనకు వివరించారు. మెట్రో విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై జరుగుతున్న పనుల పురోగతిని కూడా వెల్లడించారు.ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో కారిడార్ పనుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఆరా తీశారు. 7.5 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత పాతబస్తీ మెట్రో విస్తరణకు సంబంధించిన రోడ్ల విస్తరణ, టెండర్ ప్రక్రియ, జనరల్ కన్సల్టెంట్ నియామకంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కీలక ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆదేశించారు. మెట్రోఆర్టీసీ ఉమ్మడి పాస్ అమలుపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు తమ సాంకేతిక సన్నద్ధత గురించి వివరించారు. ఉమ్మడి పాస్ అమలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎప్పుడైనా అమలు చేయగలమని అధికారులు ప్రధాన కార్యదర్శికి తెలిపారు. దీనిపై స్పందించిన సంజయ్ జాజు, ఉమ్మడి చార్జీల విధానాన్ని త్వరగా ఖరారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సమావేశానికి హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ కె. అశోక్ రెడ్డి, మెట్రో రైల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, సీఎస్‌టీఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జీఎం (ఫైనాన్స్) సూర్యప్రకాశం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి శాఖల మధ్య సమన్వయం పెంచాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. సమావేశం అనంతరం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బేగంపేట్ నుంచి పారడైజ్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా

# ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి మహేష్ కుమార్ గౌడ్

**- ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని వెల్లడి**
**- అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్నారని విమర్శ**
**- రెండు సంవత్సరాల్లో భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు కల్పించామని స్పష్టం**
**- కుల సర్వేతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్య**



హైదరాబాద్, సెప్టెంబర్ 6, (మనప్రజాప్రతినిధి): ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పదవి అత్యంత బాధ్యతాయుతమైనదని, అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా ప్రతిపక్ష నాయకుడి హోదాను అపహాస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి చివరకు నిరాశపరిచారని ఆయన ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య రంగాన్ని కూడా గత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకే పరిమితం చేసిందని విమర్శించారు. విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని కేటీఆర్‌కు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో లక్షా 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికే 70 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని అన్నారు.కుల సర్వే నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామని తెలిపారు. గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గద్దర్ పేరిట అవార్డులు ఏర్పాటు చేసి గౌరవించిందని చెప్పారు. జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల హక్కేనని, కానీ అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు తప్పులు ఎత్తిచూపితే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

